


మూకుమ్మడి లొంగుబాటు

- ఐజీపీ ఎదుట లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు
- అందరూ బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన వారే
- రూ.25 వేలు చొప్పున చెక్కుల అందజేత..
- సత్ఫలితాలనిస్తున్న 'ఆపరేషన్ చేయూత'
- ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి తెలంగాణలో లొంగిపోతున్న వైనం

6



మాలికా పరివర్తనం నిర్వహిస్తున్న అర్చకులు



మిథిల స్టేడియం ప్రవేశద్వారం దృశ్యం



విద్యుత్‌కాంతుల మధ్య దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న భద్రాద్రి క్షేత్రం

కల్యాణ వైభోగమే

- అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు వేడుక
- శ్రీరామనామంతో మార్మోగుతున్న భద్రాచల క్షేత్రం
- కల్యాణ ఘడియల కోసం వేచిచూస్తున్న అశేష భక్తగణం
- పెళ్లి వేడుకకు కళ్లు చెదిరేలా ముస్తాబైన మిథిల స్టేడియం
- ముత్యాల తలంబ్రాలను అందజేయనున్న సీఎం రేవంత్
- హాజరుకానున్న పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- భక్తాద్రిగా మారిన గౌతమి తీరం

భూలోక వైకుంఠం భద్రాద్రిలో నేడే సీతారాముల పరిణయం

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. ఆ వైకుంఠధాముని కమనీయమైన కల్యాణం వీక్షించేందుకు దేశం నలుచెరగుల నుంచి వచ్చిన భక్తులు ఉవ్విళ్లూరుతున్నారు. భద్రుని కొండైన భద్రాచల క్షేత్రంలో ఇప్పుడు ఎటు చూసినా శ్రీరామ నామమే మార్మోగుతోంది. ఆదివారం స్వామి కల్యాణంతోపాటు సోమవారం శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనుండటంతో భద్రాద్రి భక్తాద్రిగా మారిపోయింది. భక్తులు సేద తీరేందుకు పట్టణంలో పలు చోట్ల షామియానాలు, పందిళ్ల సహాయంతో తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశారు. సమాచార కేంద్రాలు, ప్రథమ చికిత్సా కేంద్రాలను, సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత క్లాక్‌రూములు, తాగునీరు, పులిహోర పొట్లాల పంపిణీ నిర్వహించనున్నారు. కల్యాణ వేడుకలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సమర్పించనున్నారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, సీతక్క వచ్చే అవకాశాలున్నట్లు సమాచారం.

కల్యాణ వేడుకను పురస్కరించుకొని రామాలయానికి ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈసారి నవమికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ 500 బస్సులను నడుపుతోంది. దేవస్థానంలో భక్తుల రద్దీని తట్టుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్న దృష్ట్యా 2.50 లక్షలకు పైగా లడ్డూలను సిద్ధం చేసేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం 24సెక్టార్లలో 31,860మంది స్వామి వారి కల్యాణం తిలకించేందుకు అవకాశం ఉంది. ఇందులో 16,860 టికెట్లు కొనుగోలు చేసి స్వామివారి కల్యాణం తిలకించేందుకు అవకాశం ఉండగా, స్టేడియంలోని గ్యాలరీ ద్వారా 15 వేల మంది స్వామి వారి కల్యాణాన్ని ఉచితంగా తిలకించేందుకు అవకాశం ఉంది.

ఇదిలా ఉండగా 20 అత్యవసర ద్వారాల నుంచి భక్తులు బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండగా (మిగతా 6వ పేజీలో)



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఐఏఎస్‌లు శైలజా రామయ్యర్, పరికిపండ్ల నరహరి



సీఎం పర్యటన షెడ్యూల్

- 8.30కి హైదరాబాద్‌లోని ఇంటి నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు పయనం
- 8.45కు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు
- 10గంటలకు భద్రాచలం హెలీప్యాడ్‌లో దిగి సారపాక ఐటీసీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 10నుంచి 10.30 వరకు విరామం
- 10.30కి ఐటీసీ అతిథి గృహం నుంచి భద్రాద్రి రామాలయం బయలుదేరుతారు.
- 10.40-11 గంటల వరకు రామాలయ దర్శనం
- 11 గంటలకు మిథిలస్టేడియానికి చేరుకుంటారు.
- 11.10నుంచి 12.30 వరకు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తారు.
- 12.30కి మిథిలస్టేడియం నుంచి సారపాక చేరుకుంటారు.
- 12.35 నుంచి 1.10 వరకు సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం
- 1.10కి ఐటీసీ అతిథి గృహానికి చేరుకుంటారు.
- 1.15 నుంచి 2 గంటల వరకు విరామం
- 2 గంటలకు ఐటీసీ అతిథి గృహం నుంచి హెలిప్యాడ్‌కు పయనం
- 2.15కి భద్రాచలం హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం
- 3.30కి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి చేరుకుంటారు.

కల్యాణోత్సవ వేళ నేడు...

- ఉదయం 5గంటల నుంచి 5.30వరకు అలంకారం
- 5.30 నుంచి 1 గంట వరకు సర్వదర్శనం, శీఘ్ర దర్శనాలు (శీఘ్ర దర్శనం ఒకరికి రూ.100)
- ఉదయం 8 నుంచి 9 వరకు మూల మూర్తులకు తిరుకల్యాణం
- 9 నుంచి 9.30 వరకు అలంకారం
- 9 నుంచి 10.30 వరకు ఉత్సవమూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకెళ్తారు
- 10.30 నుంచి 12.30 వరకు స్వామి వారి కల్యాణ మహోత్సవం
- 12.30 నుంచి ఒంటి గంట వరకు ఊరేగింపు
- 1 నుంచి 2 వరకు మధ్యాహ్నిక ఆరాధన, రాజబోగం (దర్శనం లేదు)
- 2 నుంచి 6 వరకు సర్వదర్శనం
- 6 నుంచి 6.30- వరకు ఆరాధన(దర్శనం లేదు)
- 6.30 నుంచి 7.30 వరకు శ్రీరామ పునర్వసు దీక్ష ధారణ
- 8 నుంచి 10 వరకు చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవ
- 10 నుంచి 10.30 వరకు నివేదన

అద్వితీయం.. అభిజిత్ లగ్నం

- జన్మదినం నాడు జగదభిరాముని కల్యాణం 7

కల్యాణవేళ పుష్ప విలాసం

- రామయ్య లగ్గానికి 30 రకాల పూలు 7

రామదాసు చేయించే ఆభరణాలెన్నో...

భద్రాచలంలో కలకలం

- సీఎం రాక నేపథ్యంలో వామపక్ష నేతల ముందస్తు అరెస్టు 6

సారపాకలో సీఎం సన్నబియ్యం లంచ్

బూర్గంపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సన్న బియ్యం పంపిణీని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం విదితమే. సన్న బియ్యం అందుకున్న లబ్ధిదారుడి ఇంట్లో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగా రాష్ట్ర మంత్రులు ఇప్పటికే పలువురు లబ్ధిదారుల ఇళ్లలో భోజనం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగే శ్రీసీతారామ చంద్రస్వామి వారి కల్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారు. కల్యాణం అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకకు చెందిన బూరం శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేయనున్నట్టు అధికారులు తెలిపారు. శనివారం లబ్ధిదారుడి ఇంటిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సహ పలువురు ఉన్నాతాధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. లబ్ధిదారుడు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



లబ్ధిదారుడి ఇంటిని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్

నేటి నుంచి శ్రీరామ పునర్వసు దీక్షలు

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభం కానుంది. శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణం జరిగిన సాయంత్రం పునర్వసు దీక్ష రామాలయ ప్రాంగణంలోని భద్రుని మండపంలో ప్రారంభం కానుంది. సకల అరిష్టాలను తొలగించి సర్వాభిష్టాలను ప్రసాదించే శ్రీరామ పునర్వసు దీక్షను అధిక శాతం మంది భక్తులు స్వీకరిస్తారు. 27రోజులపాటు దీక్ష నిర్వహించిన అనంతరం మే 3న దీక్ష విరమణ చేయనున్నారు. వారి కోసం రాత్రి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. మే 4న శ్రీరామ దీక్షితుల కోసం శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. ఈ దీక్షను ఏ ప్రాంతంలోని రామాలయంలోనైనా స్వీకరించి దీక్ష విరమణ మాత్రం భద్రాద్రి రామయ్య సన్నిధిలో చేయాలని వైదిక సిబ్బంది పేర్కొంటున్నారు.

ఉక్కపోస్తోందని తలుపు తీసి నిద్రిస్తే..

బంగారు ఆభరణాల చోరీ

పెనుబల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబం ఇంట్లో ఉక్కపోతను తట్టుకోలేక ఇంటి తలుపులు తీసి మంచాన్ని అడ్డుగా వేసి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 13 కాసుల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలో జరిగింది. కుప్పెనకుంట్లలోని గుట్టపాడు గ్రామానికి చెందిన వేమిరెడ్డి నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు ఉక్కపోతను తట్టుకొనేందుకు ఇంటి తలుపులు తీసి మంచాన్ని అడ్డుగా పెట్టి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న చంద్రహారం, నాంతాడు, మూడు ఉంగరాలు, చెవిదిద్దులు చోరీ చేశారు. రూ.9లక్షల విలువ ఉంటుందని బాధితులు తెలిపారు. ఘటనపై బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వీఎంబంజర్, కల్లూరు ఎస్‌ఐలు కె.వెంకటేష్, హరితలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది.

ఫలించిన మంత్రి తుమ్మల కృషి

- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి సీఎం గ్రీన్‌సిగ్నల్
- విశ్వ విద్యాలయంగా అప్‌గ్రేడ్ కానున్న మైనింగ్ కళాశాల
- నేడు భద్రాద్రిలో అధికారిక ప్రకటన చేయనున్న సీఎం
- దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా గుర్తింపు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న మంత్రి తుమ్మల (ఫైల్)

కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. కొత్తగూడెంలోని మైనింగ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో యూనివర్సిటీ ఏర్పాటుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చేసిన కృషి ఫలించినట్లయింది. అనేక ఖనిజాలకు నెలవైన భద్రాద్రి జిల్లాలో మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. జియోకెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెటరి జియాలజీ, జియో మెరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ పర్యావరణ శాస్త్రం వంటి భిన్నమైన కోర్సులు ఈ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ పరిధిలోకి వస్తాయని, దేశంలో ఈ తరహా యూనివర్సిటీ లేదని చెప్పడంతో నిపుణుల నుంచి నివేదికలు తెప్పించుకున్న అనంతరం ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి ఆమోదం తెలుపుతూ శనివారం ప్రకటన జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీని భద్రాద్రి జిల్లాలో మంజూరు చేయడం ఉమ్మడి జిల్లాకు లభించిన గొప్ప వరంగా భావించవచ్చు. కాగా, తన అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని ప్రతి పనిలో సహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

300 ఎకరాల్లో విశ్వవిద్యాలయం...

300 ఎకరాల్లో ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం రూపుదిద్దుకోనుంది. కొత్తగూడెంలోని సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ ప్రాంతంలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. అత్యున్నత (మిగతా 6వ పేజీలో)

మహనీయుల బాటలో పయనించాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల
- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతీయ నాయకులు, మహనీయులు చూపిన బాటలో నేటియువత పయనించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జగ్జీవన్‌రామ్ జయంతి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన జగ్జీవన్‌రామ్ గ్రీన్‌రెవల్యూషన్‌తో వ్యవసాయంలో సమూల మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. తద్వారా ఇప్పుడు భారత దేశం నుంచి విదేశాలకు ఆహార ధాన్యాల ఎగుమతి జరుగుతోందన్నారు. జగ్జీవన్‌రామ్ సమాజంలో మార్పుల కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రతీ విద్యార్థి ఉన్నత భావాలతో భవిష్యత్‌పై మంచి ప్రణాళికతో విద్యాభ్యాసం చేయాలన్నారు. తద్వారా భవిష్యత్‌లో మంచి పౌరులుగా, అధికారులుగా ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. జగ్జీవన్‌రామ్ కమిటీ కన్వీనర్ దాసుమహారాజ్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాల ప్రభావానికి గురవుతున్నారని, గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని, బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఫోర్జరీ పత్రాలు సృష్టించిన

నిందితుల అరెస్టు

టు టౌన్ సీఐ బాలకృష్ణ

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కీలకమైన జంట హత్యకేసుల్లోని నిందితులకు బెయిల్ ష్యూరిటీల కోసం ఫోర్జరీ పత్రాలు సృష్టించిన నలుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు టుటౌన్ సీఐ బాలకృష్ణ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నేలకొండపల్లి మండలంలో గతేడాది డిసెంబరు నెలలో జరిగిన వృద్ధ దంపతుల హత్యకేసులో అరెస్టయి జైల్లో ఉన్న నిందితులకు బెయిల్ ఇప్పించేందుకు నేరపూరిత కుట్రలో భాగంగా ఉప్పలచలక పంచాయతీ సెక్రటరికి సంబంధించిన సంతకాన్ని అదే విధంగా పంచాయతీ కార్యాలయ ముద్రను నలుగురు ఫోర్జరీచేశారు. నకిలీ ఆస్తి వాల్యుయేషన్ ఫోర్జరీ ష్యూరిటీలను తయారుచేసి న్యాయస్థానంలో సమర్పించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించారని సీఐ తెలిపారు. జైలులో ఉన్న నిందితులతో పాటు ఫోర్జరీ చేసిన బానోతు భరత్, సునావత్ రవి, న్యాయవాది లతీఫ్, పోట్లపల్లి సురేష్‌లను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఉప్పలచలక పంచాయతీ సెక్రటరి వాంకుడోతు రవితేజ ఇటీవల ఫిర్యాదు ఇవ్వడంతో ఆఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తులో వివరాలు తెలిసిన తర్వాత నిందితులను అరెస్టుచేసి రిమాండ్ చేసినట్టు సీఐ ప్రకటనలో తెలిపారు.

పోలీసుల అదుపులో పాస్టర్ అజయ్‌బాబు

ఖమ్మం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముస్లిం దళిత్ డిఫెన్స్ ఫోర్స్ (సీఎండీఫ్) నేత పాస్టర్ అజయ్ బాబును శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి విషయంలో హత్య అని పేర్కొంటూ యాక్టివ్‌గా మాట్లాడిన ఆయనపై సోషల్ మీడియా వేదికగా పలువురు ఆరోపణలు చేస్తున్నారని, తనని చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఇటీవల ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో పలువురిపై కేసు నమోదైంది. కాగా పాస్టర్ అజయ్‌బాబును ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీ తన ఇంటి వద్ద ఉన్న సమయంలో శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే అజయ్‌బాబును అదుపులోకి తీసుకోవడానికి సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించి కేసా?, మరేదైనా కేసుకు సంబంధించి ఆయనను అదుపులోకి తీసుకున్నారా? అన్న విషయంపై మాత్రం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆయన్ని హైదరాబాద్‌కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారన్న ప్రచారం జరుగుతుంది. స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం ఓ కేసు విషయమై శనివారం సాయంత్రమే ఖమ్మం వచ్చి స్థానిక పోలీసుల సహకారంతో అజయ్‌బాబును అదుపులోకి తీసుకొని హైద్రాబాద్‌కు తరలించినట్టు తెలిసింది.

భూ మాఫియాను

అడ్డుకుంటాం

- సాంకేతిక కారణాలతో రైతుల భూముల్ని లాక్కుంటే ఊరుకోం
- పుట్టకోటలో రాజకీయ అఖిలపక్షం బహిరంగ సభ
- పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా రైతులు స్వయంగా సేద్యం చేస్తున్న వ్యవసాయ భూములపై రియల్ భూ మాఫియా కొన్ని సాంకేతిక అంశాలను అడ్డుపెట్టుకొని భూ ఆక్రమణలకు పాల్పడుతుందని అటువంటి శక్తులను అడ్డుకొని తగిన గుణపాఠం చెపుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. శనివారం రాత్రి ఖమ్మం విలీన గ్రామం పుట్టకోటలో నిర్వహించిన వామపక్ష, కాంగ్రెస్, బీఆర్ఎస్ బహిరంగ సభలో కూనంనేని మాట్లాడారు. 50ఏళ్లకు పూర్వం ఉమ్మడి జిల్లాలో కర్ణాలు, జమిందార్ల పేరుతో రికార్డులో భూములు ఉన్నాయని తర్వాత కాలంలో ఆయా భూములు రైతుల చేతిలోకి వచ్చి రైతులే వ్యవసాయం చేస్తుంటే పాత కాలం నాటి రికార్డులను బయటకు తీసి భూ మాఫియా రైతులను భయభ్రాంతులకు గురి చేసి వ్యవసాయ భూముల్ని కబ్జాలు చేసేందుకు బరితెగించిందని అటువంటి మాఫియాకు తగిన విధంగా ఎదుర్కొంటామన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ముఠా ఉమ్మడి ఖమ్మం జిల్లా భూములపై కన్నేసిందని తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఎదుర్కొన్న కమ్యూనిస్టులకు భూ మాఫియాను అడ్డుకోవటం పెద్దసమస్య కాదన్నారు. ఆధునిక కాలంలో తిరిగి భూ పోరాటాలు చేయాల్సిన పరిస్థితి భూ మాఫియా ద్వారా ఏర్పడిందన్నారు. రైతులభూముల మీదకు ఎటువంటి మాఫియా వచ్చిన వాటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 56ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్న భూముల్ని పాత కాలం నాటి దస్త్రాలతో భూ మాఫియా తిరిగి తీసుకునే ప్రయత్నాలు చేస్తోందన్నారు. తెలంగాణలో రిజిస్ట్రేషన్‌లు లేనందును దశాబ్దాలుగా రైతులు తమ భూముల్ని రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు.భూ మాఫియాను అడ్డుకునేందుకు సీపీఎం మద్దతు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు చోటేబాబు, బీఆర్ఎస్ నాయకులు కోటేశ్వరరావు, నర్సింహారావు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, లతాదేవి, నర్సింహారావు, శివరామకృష్ణ, రామకృష్ణ, మల్లేష్, ఏనుగు గాంధీ, శ్రీనివాస్, కళావతి, వెంకటేశ్వరరావు, మహ్మద్ సలామ్ పాల్గొన్నారు.



చర్చలు జరుపుతున్న కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్లు

50 ఆకుల తునికాకు కట్టకు

రూ.3.31 పైసలు

కొత్తగూడెం డివిజన్ పరిధిలోని 12 యూనిట్లకు వర్తింపు

గుండాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రెండో పంట తునికాకు సేకరణలో భాగంగా ఈ ఏడాది రేటు నిర్ణయించడం జరిగింది. గుండాల మండల పరిధిలోని శెట్టుపల్లి గ్రామంలో తునికాకు రేటు పెంపుదల పోరాట కమిటీ, తునికాకు కాంట్రాక్టర్ల మధ్య శనివారం చర్చలు జరిగాయి. చర్చల్లో భాగంగా ప్రభుత్వ ధర గతేడాది రూ.3 ఉండగా.. ఈ ఏడాది ప్రభుత్వం మరో రూ.30పైసలు పెంచింది. కాగా మొత్తం ప్రభుత్వ ధర రూ.3.30 పైసలు ఉండగా అదనంగా మరో రూ.0.05 పైసలు పెంచాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేశారు. చర్చల అనంతరం అదనంగా రూ.0.01 పైసలు చెల్లిస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ ధర రూ3.30పైసలు ఉండగా కాంట్రాక్టర్ అదనంగా మరో రూ.01పైసలు చెల్లిస్తుండటం తో 50ఆకుల కట్టకు రూ.3.31 పైసలుగా ధర నిర్ణయించారు. కల్లేదార్ల కమీషన్, హ్యాండ్లింగ్ చార్జీలు గతంలో వెయ్యి కట్టలకు రూ.332.75 ఉండగా ఈ సారి 10శాతం పెంచుతూ రూ.366.02కు పెంచారు. కల్లేదార్ల కమీషన్ రూ.172.75పైసలు పల్టా, కుచ్చాలకు రూ.87.88 భర్తీకి రూ.105.04 కేటాయించారు. ఈ చర్చల్లో కాంట్రాక్టర్లు రమేష్ రెడ్డి, ముంతజిములు సయ్యద్ అజ్జు, ఖుద్దూస్, తునికాకు పోరాట కమిటీ అధ్యక్షులు గుంపిడి వెంకటేశ్వర్లు, చిన్న చంద్రన్న, సీపీఐ నాయకులు రేసు ఎల్లయ్య, రమేష్, న్యూడెమోక్రసీ నాయకులు ముక్తి సత్యం, కోరం సీతారాములు, అవునూరి మధు, ప్రజాపంథ పార్టీ నాయకులు కొమరం శాంతయ్య, చంద్రన్న వర్గం నాయకులు బానోత్ ఉక్లా, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఫలించిన మంత్రి తుమ్మల కృషి

(5వ పేజీ తరువాయి)

ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుంది. మైనింగ్ కళాశాలను విశ్వ విద్యాలయంగా మార్చడం ద్వారా వేలాదిమంది యువ శాస్త్రవేత్తలు ఇక్కడి నుంచే దేశ భవిష్యత్తుకు బాటలు వేయనున్నారు. నాగరికతతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడంలో సహజ వనరులు కీలక పాత్ర పోషిస్తాయి. ఎర్త్‌సైన్స్‌సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులతో జాతీయస్థాయిలో కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంది.

భద్రాద్రి జిల్లాకు మహర్దశ

ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మహర్దశ పట్టనుంది. ఈ యూనివర్సిటీతో ఈ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి, వేలాది మంది విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశాలు లభించడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారయ్యే అవకాశాలున్నాయి. ఎర్త్‌సైన్స్‌సెస్ యూనివర్సిటీలో జీయె కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానిట్రీ జీయాలజీ, జీయో మెరపాలజీ, స్ట్రక్చర్ జీయాలజీ, ఖనిజశాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర స్థాయిలో ప్రవేశాలు కల్పించే అరుదైన అవకాశం లభించనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నలుమూల నుంచి విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

సీఎం రాక నేపథ్యంలో

వామపక్ష నాయకుల అరెస్ట్



వామపక్ష నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం భద్రాచలం రానున్న నేపథ్యంలో వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ఇంటికివెళ్లి ఆయనను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగారెడ్డి, ఇతర నాయకులు ఎర్రంశెట్టి రామారావు, దళితసంఘం నాయకుడు దాసరి శేఖర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. ఇదే రీతిలో ఇతర నాయకులను అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కాగా వామపక్ష, దళితసంఘాల నాయకులను పోలీసులు అదుపులో తీసుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- సెంట్రల్ జేఏసీ చైర్మన్ మారం జగదీష్
- పాల్వంచలో జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం

పాల్వంచ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులకు సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సెంట్రల్ జేఏసీ చైర్మన్ మారం జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ సుగుణ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 సంఘాలకు సంబంధించి 13.31 లక్షల ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని అన్నారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చేది బెనిఫిట్స్ కాదని, వారు కష్టపడి సంపాదించి, దాచుకున్న సొమ్మని అన్నారు. ప్రభుత్వం ఉచితాల మీద చూయిస్తున్న శ్రద్ధ ఉద్యోగుల సమస్యలపై చూయించకపోవడం విచారకరమన్నారు. సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 30 వరకు జిల్లా కేంద్రాల్లో సదస్సులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అదేవిధంగా మే 4న రాష్ట్రస్థాయి ఉద్యోగ సదస్సు నిర్వహిస్తామని, మే 15న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. వీటిపై ప్రభుత్వం నుంచి స్పందన రాని పక్షంలో జూన్ 9న రాష్ట్రస్థాయిలో మహా ధర్నా చేపడతామన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర సెక్రెటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, టీఎన్‌జీవో భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రామారావు, జిల్లా కార్యదర్శి కంచర్ల సాయిభార్గవ్ చైతన్య, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి రవి, టీఎస్‌సీ పీఎస్‌ఈయూ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, టీఎన్‌జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంట్రల్ జేఏసీ చైర్మన్ మారం జగదీష్

ఎనిమిదేళ్ల తర్వాత

భద్రాద్రి నవమికి సీఎం రాక

భద్రాచలం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 2016 ఏప్రిల్ 15న అప్పటి సీఎం కె. చంద్రశేఖర్‌రావు వచ్చిన అనంతరం మరోసారి సీఎం ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలతో భద్రాద్రికి రాలేదు. గత ఎనిమిది ఏళ్లలో ఏడేళ్లుగా అప్పటి దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. గతేడాది ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు.

కల్యాణ వైభోగమే

(5వ పేజీ తరువాయి)

తొమ్మిది ద్వారాల నుంచి లోపలికి ప్రవేశించేందుకు, నాలుగు ద్వారాల నుంచి బయటకు వెళ్లేందుకు అవకాశం ఉంది. కాగా స్టేడియంలో స్వామి వారి కల్యాణం భక్తులు వీక్షించేందుకు ప్రతీ సెక్టార్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. భద్రత చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. 200 కూలర్లు, 50 టన్నుల ఏసీలను, 250 ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీరామ మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. అత్యవసర చికిత్సా కేంద్రాలు 25, ఉచిత తలంబ్రాల పంపిణీ కేంద్రాలు 60, ప్రసాదాల విక్రయ కౌంటర్లు 19ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

నిఘా నీడలో భద్రగిరి

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భద్రాచలంలో పోలీసు శాఖ కనీవిని ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేసింది.. మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, 1800మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. అడిషనల్ ఎస్పీలు ఒకరు, 16మంది డీఎస్పీలు, 66మంది సీఐలు, 185 ఎస్ఐలు, 304 మంది ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 555, మహిళా ఎస్ఐ/ హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 414 హోంగార్డులతోపాటు స్పెషల్ పార్టీలు, ఆర్మ్‌డ్ రిజర్వుడు సెక్షన్లు, సీర్పీఎఫ్ సెక్షన్లు, బాంబ్ డిస్పోజబుల్ బృందాలతో బందోబస్తు నిర్వహించనున్నారు.

గోల్కొండ ఏడో నవాబుతో శ్రీకారం

తానీషాగా ప్రసిద్ధిగాంచిన అబుల్ హసన్ కుతుబ్‌షా దక్షిణ భారతదేశంలో గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహీ వంశానికి చెందిన ఏడో, చివరి చక్రవర్తి. అలాగే తానీషా అబ్దుల్లా కుతుబ్‌షా మూడో అల్లుడు. ఈయన 1672 నుంచి 1687 వరకు గోల్కొండను పాలించారు. గోల్కొండ ఏడో నవాబు హయాంలో రామయ్యకు ముత్యాల తలంబ్రాల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఎందరో ముఖ్యమంత్రులు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను నవమినాడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా అందజేశారు. అప్పటి సీఎంలు ఎందరో ఈ సంప్రదాయానికి అగ్రతాంబూలం ఇస్తూ స్వామివారికి సమర్పించేవారు. ఇందులో అప్పటి సీఎంలు జలగం వెంగళరావు, టంగుటూరి అంజయ్య, పీవీ నర్సింహారావు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబునాయుడు, డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్యతో పాటు ఉమ్మడి ఏపీ చివరి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత 2015, 2016లో రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దంపతులు స్వామి వారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించారు.

సీఎం గారు.. మా గోడు వినండి

- ఏజెన్సీలో ఎన్నో సమస్యలు
- సీఎం దృష్టి సారించాలని కోరుకుంటున్న ప్రజలు

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఏజెన్సీలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు అందించేందుకు వస్తున్న క్రమంలో ఈ సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన భద్రాచలం ఏజెన్సీ పలు మండలాలు ఏపీలో విలీనం కావటంతో ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. భద్రాద్రి అభివృద్ధికి ఎంతో కీలకమైన ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. జీఎంఆర్ పాలిటెక్నిక్ ఏపీ పరిధిలోకి వెళ్లిందని, ప్రతిభా పాఠశాల ఖమ్మం జిల్లాకు తరలిపోయిందని, పలు ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఈ ప్రాంతం నుంచి మరో చోటకి తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు.

అదేవిధంగా గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద ఐటీడీఏగా ఉన్న భద్రాచలం నేడు ఏజెన్సీ మండలాలు ఏపీలోకి వెళ్లటంతో పరిధి తగ్గిందని అలాగే ఐటీడీఏ నిర్వీర్యం అయిందని కీలక విభాగాలకు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నాయని వాటిని సరిదిద్ది ఐటీడీఏకు పూర్వ వైభవం తేవాలని గిరిజనులు ఆకాంక్షిస్తున్నారు.

ఏజెన్సీ వైద్యానికి ఊపిరిపోయిండి...

భద్రాచలం ఏరియా వైద్యశాల నాలుగు రాష్ట్రాలకు కూడలిగా ఉండగా ఇక్కడ వైద్యులు ,సిబ్బంది సమస్య నెలకొంది. కీలక వైద్యులైన గైనకాలజిస్ట్ పోస్టులలో కనీసం ఆరుగురైనా ఉండాల్సి ఉండగా అందరూ కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగుతున్నారు. అధునాతన వైద్య చికిత్స అందించేందుకు మరిన్ని వైద్య పరికరాలు, సిబ్బంది ఎంతో అవసరం. ఇదిలా ఉండగా భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాల కావాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

గిరిజన క్రీడా పాఠశాల ఏర్పాటు చేయాలని ఏజెన్సీ క్రీడాకారులు కోరుతున్నారు. ముఖ్యంగా విలు విద్యలో ఈ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారు ఉన్నారని ఉదహరిస్తున్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని ఏజెన్సీ మండలాలకు ముంపు సమస్యను తగ్గించేందుకు కరకట్ట నిర్మాణం చేపట్టాలని ముంపు ప్రాంత వాసులు కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భ ద్రాచలంకు ముంపు పొంచి ఉన్న క్రమంలో కరకట్టలను బలోపేతం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. అదేవిధంగా రామాలయ అభివృద్ధిపై సైతం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలపాలని రామభక్తులు కోరుతున్నారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతోంది.

మూకుమ్మడి లొంగుబాటు

- ఐజీపీ ఎదుట లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు
- అందరూ బీజాపూర్, సుక్మా జిల్లాలకు చెందిన వారే
- రూ.25 వేలు చొప్పున చెక్కుల అందజేత..
- సత్ఫలితాలనిస్తున్న 'ఆపరేషన్ చేయూత'
- ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి తెలంగాణలో లొంగిపోతున్న వైనం

కొత్తగూడెం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈసారి ఎన్‌కౌంటర్ పరంగా కాదు.. ఆపరేషన్ చేయూతతో భారీగా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన 86 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు పోలీసుల సమక్షంలో సరెండర్ అయ్యారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కొక్కరికి తక్షణ సహాయం కింద రూ.25వేలు అందించారు. భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో భాగంగా మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి ఎదుట 86 మంది మావోయిస్టులు దళ సభ్యులు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడుతూ... ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు బీజాపూర్ జిల్లా, సుక్మా జిల్లా సభ్యులు లొంగిపోయారు. గత నాలుగు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 203మంది లొంగిపోగా.. మరో 66 మందిని అరెస్ట్ చేశాం. కొత్తగూడెం పోలీసు అధికారులు మావోయిస్టులతో ఫ్రెండ్లీగా మాట్లాడి ఒప్పించారని, నమ్మకం ఏర్పాడ్డాకే వీరంతా లొంగిపోయారని, ప్రభుత్వం తరఫున సహాయం అందించినట్టు ఐజీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై జనజీవన స్రవంతిలోకి మావోయిస్టులు వచ్చేందుకు సిద్ధం అయ్యారని పోలీసులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రికొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు, ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ అజ్ఞాతాన్ని వీడండి.. జనజీవన స్రవంతిలో కలవండి. ప్రభుత్వం ద్వారా వచ్చే సహాయాన్ని అందిస్తాం అని వారు సూచించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

భక్తులకు ఇబ్బంది

కలగకూడదు

- రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం

దుమ్ముగూడెం ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లుండాలని రాష్ట్ర అటవీ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. పర్ణశాలలో నవమి ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, పార్కింగ్, పారిశుధ్యం, చలువ పందిళ్ల ఏర్పాటులో లోపాలు జరగకూడదన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అర్చకుడు రాజగోపాలాచార్యులు కుటుంబాన్ని పరామర్శించి, పీవీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.30వేల నగదును అందజేశారు. మృతిచెందిన నాగేశ్వరావు, పూజారి వీరభద్రరావు కుటుంబాలను పరామర్శించారు.

పెళ్లి పత్రికలు పంచి వస్తుండగా..

- ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ
- యువకుడి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన వేణు

కల్లూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని రాష్ట్రీయ రహదారిపై శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కల్లూరు మండలం ఓబుల్‌రావుబంజరు గ్రామానికి చెందిన బాణోతు వేణు(22) వివాహం ఈ నెల 11వ తేదీన వివాహం ఉన్నందున కల్లూరులో శుభలగ్నం పత్రికలు పంపిణీ చేసి తన తండ్రి చిన్నకృష్ణతో కలిసి బైక్‌పై ఓబుల్‌రావు బంజరుకు వెళ్తుండగా, ఖమ్మం వైపు నుంచి బి. జస్వంత్ అనే వ్యక్తి తన మిత్రుడు ఇందుకాంత్‌తో కలిసి కల్లూరుకు బైక్‌పై వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న బైక్‌లు కల్లూరు సమీపంలోని రాష్ట్రీయ ప్రధాన రహదారిపై ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వేణు అక్కడికక్కడే మృతి చెందగా మరోబైక్‌పై ఉన్న జస్వంత్ తలకు బలమైన గాయం కావటంతో పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం అతడిని ఖమ్మం తరలించారు. కాగా ఓబుల్‌రావుబంజరు గ్రామానికి చెందిన బాణోతు వేణుకు అదే మండలంలోని యర్రబంజర గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 11వ తేదీన వివాహం జరగనున్నది. ప్రమాద సమాచారం అందుకున్న కాబోయే వధువు, వరుడి కుటుంబ సభ్యులు కల్లూరుకు చేరుకొని వేణు మృత దేహం చూసి బోరున విలపించారు.

ఉడతా భక్తిగా..

- రాములోరి కల్యాణానికి వన్‌గ్రామ్ గోల్డ్ జరీ పట్టు వస్త్రాలు
- స్వయంగా నేసి అందజేసిన సిరిసిల్ల దంపతులు



అందజేసిన పట్టువస్త్రాలు ఇవే..

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి సిరిసిల్లకు చెందిన వెండి హరిప్రసాద్, రేఖ దంపతులు వన్‌గ్రామ్ జరీతో పట్టు వస్త్రాలను తయారు చేసి శనివారం ఎదుర్కోలు నిర్వహిస్తున్న సమయంలో అందజేశారు. సీతమ్మవారి చీర కొంగులో గర్భగుడిలో మూలవరుల చిత్రం వచ్చేలా నేశారు. చీర కింది భాగంలో శంఖచక్ర నామాలు, హనుమంతుడు, గర్మంతుడి చిత్రాలు ఉన్నాయి. ఈ చీర ఏడు గజాల పొడవు, 800 గ్రాముల బరువుతో నేసినట్లు హరిప్రసాద్ తెలిపారు. భద్రాద్రి రామాలయానికిచీర అందజేయడం ఇది మూడోసారని తెలిపారు.


పర్ణశాలలో ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పర్ణశాల రామాలయంలో శనివారం ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా జరిగింది. సీతారామచంద్రస్వామి వార్ల గుణగణాలను అర్చకులు వివరించారు. నిత్యాహోమం, నిత్యా పూర్ణాహుతి తిరువీధి సేవలను నిర్వహించారు. అర్చకులు భార్గవాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహాచార్యులు, ఇంచార్జి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





రామదాసు చేయించే.. ఆభరణాలెన్నో..



భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామికి ప్రస్తుతం సుమారు 68 కిలోల బంగారం, 964 కిలోల వెండి ఉంది. కాగా స్వామి వారి కల్యాణ సమయం, ముఖ్య ఉత్సవాల సమయంలో భక్తరామదాసుగా పేరుగాంచిన కంచర్ల గోపన్న చేయించిన బంగారు ఆభరణాలనే వినియోగిస్తారు. వజ్రాలు, పొదిగి, విలువైన పచ్చలు వేలాడగట్టిన సుందరమైన పచ్చల పతకం, కెంపులు పొదిగి ముత్యాలతో వేలాడే చింతాకు పతకం, కిరీటంలో అలంకరించే వజ్రాలు పొదిగిన కలికితురాయి తదితర విలువైన ఆభరణాలు భక్తరామదాసు చేయించారు.

- రామయ్యకు పచ్చల పతకం.. సీతమ్మకు చింతాకు పతకం
- భద్రాద్రి రామయ్యకు 68 కిలోల స్వర్ణం.. 964 కిలోల వెండి
- నేటికీ భక్తరామదాసు చేయించిన ఆభరణాలతోనే కల్యాణం

భద్రాచలం ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి ప్రస్తుతం సుమారు 68 కిలోల బంగారం, 964 కిలోల వెండి ఉంది. కాగా స్వామి వారి కల్యాణ సమయం, ముఖ్య ఉత్సవాల సమయంలో భక్తరామదాసుగా పేరుగాంచిన కంచర్ల గోపన్న చేయించిన బంగారు ఆభరణాలనే వినియోగిస్తారు. వజ్రాలు, పొదిగి, విలువైన పచ్చలు వేలాడగట్టిన సుందరమైన పచ్చల పతకం, కెంపులు పొదిగి ముత్యాలతో వేలాడే చింతాకు పతకం, కిరీటంలో అలరించే వజ్రాలు పొదిగిన కలికితురాయి తదితర విలువైన ఆభరణాలు భక్తరామదాసు చేయించారు.

భక్తరామదాసును తానీషా నవాబు కారాగారంలో బంధించిన సమయంలో ఆలపించిన కొన్ని కీర్తనల్లో ఈ నగల ప్రసక్తి ఉండటం విశేషం. ఇక్ష్వాకుల తిలక ఇకనైన పలకవే రామచంద్రా.. అనే కీర్తనలో సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా.. ఆ పతకమునకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా అంటూ ఆ క్రోశిస్తూ కలికితురాయి నీకు పొలుపుగా చేయిస్తి, రామచంద్రా.. నీవు కులుకుతూ తిరిగేవు ఎవడబ్బ సొమ్మని రామచంద్రా అని తిరిగి తన తప్పులు తెలుసుకున్న భక్తరామదాసు అబ్బ తిట్టితినని అయాసపడవద్దు రామచంద్రా ఈ దెబ్బల కోర్వక అబ్బ తిట్టితినయ్యా రామచంద్రా... అని వాపోయారు. భద్రాద్రి రామునికి రామదాసు చేయించిన ఆభరణాలనే నేటికీ ధరింపజేస్తారు. రామదాసును చెరసాల నుంచి విడిపించడానికి తానీషా నవాబుకు రామలక్ష్మణులు సమర్పించారన్న బంగారు రామమాడ నాణాలు కొన్ని ఈనాటికీ భద్రాద్రి ఆలయంలోనే ఉన్నాయి. రామటెంకిగా పిలిచే ఈ నాణెంపై దేవనాగరి లిపి ముద్రించి ఉంది. కల్యాణం రోజున రాముల వారు ధరించే రవ్వల వైరముడి, మధ్యలో గల నీలపురాయి మద్రాసుకు చెందిన వేశ్య శ్రీరామునికి సమర్పించిందని కథనం. తూము నర్సింహదాసు స్థిరీకరించిన మహారాజ సేవోత్సవం సందర్భంగా ఆయన రాసిన ఒక కీర్తన పూజ సేయరే స్వామికి బంగారు పూలతో పూజ సేయరే స్వామికి అన్న దానికి అన్వయిస్తూ చిన జీయర్‌స్వామి 108 బంగారు పుష్పాలను సమర్పించారు. సీతమ్మ వారికి, రాముల వారికి కంకణాల అలంకరణకు సయ్యద్ మీరా అనే ముస్లిం భక్తుడు బంగారు తోడాలు ఇచ్చారు. భక్తరామదాసు 30 తులాలతో చేయించిన మూడు బంగారు మంగళసూత్రాలతోనే సీతమ్మ వారికి సూత్రధారణ జరుగుతుంది. ఆ తర్వాత కూడా చాలా మంది భక్తులు స్వామికి ఎన్నెన్నో ఆభరణాలు, అలంకారాలు చేయించారు. విశాఖపట్టణానికి చెందిన పద్మజారెడ్డి స్వామి ఊంజల్ సేవకు బంగారు ఊయలను బహూకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన రామస్వామి అనే భక్తుడు బంగారు గొడుగును రామపాదుకలను సమర్పించారు. బీసీసీఐ మాజీ ఛైర్మన్, ఇండియా సిమెంట్స్ ఎండీ శ్రీనివాసన్ భద్రాద్రి రామాలయంలో రూ.40 లక్షల ఖర్చుతో రామాలయంలో బంగారు వాకిలి తయారు చేయించారు. బెంగళూరుకు చెందిన జేవీ రంగరాజు శ్రీదేవి దంపతులు 12.8 కిలోల స్వర్ణ కవచంను మూలవరులకు చేయించారు. దీని విలువ సుమారు రూ.3.85 కోట్లు ఉంటుంది. 2024 ఫిబ్రవరిలో భద్రాద్రి దేవస్థానం అధికారులు 103కిలోలతో అంతరాలయ ప్రవేశ ద్వారానికి వెండి వాకిలి ఏర్పాటు చేశారు.



రామాలయంలో శ్రీరామ స్మరణ చేస్తున్న జంగారెడ్డి గూడెం పరిసర ప్రాంత భక్తులు



మిథిల స్టేడియంలో భక్తులు



గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు



రామాలయానికి చేరుకుంటున్న భక్తులు



శ్రీ సీతారాముల కల్యాణం దృశ్యం

అన్ని తరాలకు ఆదర్శజంట

సమాజంలో నాటి నేటితరానికి సీతారాములే ఆదర్శ జంటగా నిలుస్తున్నారు. దీనికి కారణం అనోన్య దాంపత్యానికి, బంధానికి వారు ప్రతిరూపంగా నిలుస్తున్నారు. ఎన్ని తరాలు, యుగాలు దాటినా ఆ జంటే నేటి తరానికి ఆది దంపతులే ఆదర్శం, ఆరాధ్యం అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. నేటికి నూతన వధూవరులను ఆశీర్వదించే క్రమంలో సీతారాముల్లా కలకాలం జీవించాలని పెద్దలు దీవిస్తూ ఉంటారు. ఇందుకు కారణం 14 ఏళ్లు అరణ్యవాసంలో ఒకరికొకరు దూరమైనా ప్రేమానురాగాల్లో వారికి సాటెవరు లేరు.

సీతారాముల కల్యాణం సాగుతుందిలా..

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో అపురూపమైన సీతారాముల జంట కల్యాణాన్ని ప్రతి ఏటా చైత్రశుద్ధ నవమి నాడు జరుపుకొని భక్తి శ్రద్ధలు చాటుకుంటారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనటువంటి అరుదైన ఈ ఘట్టాన్ని కనులారా వీక్షించాలని ఆకాంక్షించే వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. నాటి నుంచి నేటి వరకు ప్రతి పల్లెలో, ప్రతి గ్రామంలో, పట్టణాలు, నగరాల్లో, విదేశాల్లో సైతం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం జరుపుకోవడం ఒక సంప్రదాయంగా మారింది. హిందుధార్మిక వ్యవస్థలో భార్య భర్తల బంధానికి ప్రత్యేక చిహ్నంగా నిలిచే ఈ కల్యాణం తిలకించి కల్యాణ అక్షింతలు తాము వేసుకుంటే ఈ జన్మలోనే కాదు మరు జన్మలో సైతం తాము సీతారాముల జంటలా ఉండాలని అధిక శాతం మంది భక్తులు భావిస్తారు. అందుకే రామయ్య కల్యాణ తలంబ్రాలకు ఎక్కడా లేని విశిష్టత ఉంది. కల్యాణానికి ముందు తలంబ్రాలను కలిపే సమయంలో సైతం ముత్తైదువులు ఈతంతులో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది.



కల్యాణం జరిగేది ఇలా...

తొలుత భద్రాద్రి రామాలయంలో మూలవరులకు ప్రత్యేక అలంకరణ నిర్వహించి కల్యాణం ఏకాంతంగా చేస్తారు. అనంతరం మంగళవాయిద్యాలు మోగుతుండగా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య పల్లకిలో కల్యాణ మండపానికి స్వామి తరలివస్తారు. ముందుగా తిరుకల్యాణానికి సంకల్పం చేసి ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి, కల్యాణానికి ఉపయోగించే సకల వస్తు సామగ్రికి సంప్రోక్షణ చేస్తారు. తరువాత రక్షాబంధనం, యోక్త్రబంధనం అనంతరం ఎనిమిది మంది శ్రీ వైష్ణవులకు తాంబూలాది సత్కారాలను చేసి కన్యావరణం చేస్తారు. తరువాత వధూవరుల ఇరు వంశాల గ్రోతాలను పఠించి స్వామి పాద ప్రక్షాళన అనంతరం పరిమళభరిత తీర్థంతో మంత్రోక్తంగా పుష్పోదక స్నానం చేయిస్తారు. గోదానం చేసి మహాసంకల్పం పఠిస్తారు. ఈ మహాసంకల్పంకు అనుగుణంగా కన్యాదానం జరుగుతుంది. అనంతరం మంగళవాయిద్యాలు మారు మోగుతుండగా వేద పండితుల వేద మంత్రాల మధ్య అభిజిల్లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచుతారు. ఆ తరువాత మాంగల్యపూజలో మంగళసూత్రాలతో ముగ్గురు అమ్మవార్లను ఆవాహన చేస్తారు. తొమ్మిది పోగులతో మూడుసూత్రాలతో తయారయ్యే మంగళ సూత్రం ఎన్నో వేదాంత రహస్యాలను చాటి చెబుతుంది. తొమ్మిది పోగులు వివిధ సంబంధాలకు ప్రతీకలు. మూడు సూత్రాలు కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలకు సంకేతాలు. సూత్రంలో గౌరీదేవిని, సూత్ర మధ్యంలో సరస్వతిని, సూత్ర గ్రహంలో మహాలక్ష్మిని ఆవాహన చేస్తారు. ఆ ముగ్గురమ్మలను ఆవాహన చేసిన మంగళసూత్రాలలో భక్తరామదాసు చేయించిన మంగళపతకాన్ని కలిపి ధరింపజేయడంతో మంగళ సూత్రధారణ పూర్తవుతుంది. ఆ తర్వాత శ్రీ వైష్ణవ సం ప్రదాయాన్ని ఆచరించి గోదాదేవి శ్రీ రంగనాథునితో కల్యాణం జరిగినట్లు కలగన్న వైవాహిక స్వప్నం వారణమాయిరం అన్న పది తమిళ పద్యాలు పాడుతూ అర్చక స్వాములు బంతులాట ఆడతారు. అనంతరం సీతారాముల శిరస్సుపై తలంబ్రాలను వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ అర్చక స్వాములు పోస్తారు. ఇదే సమయంలో కర్పూర నీరాజనం సమర్పిస్తారు. చతుర్వేదాలతో సీతారాములకు ఆశీర్వచనం ఇవ్వడంతో ఈ కల్యాణ క్రతువు పూర్తవుతుంది.

నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం

- ఆహ్లాదకరంగా మాలికా పరివర్తనం

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శనివారం రాత్రి సంప్రదాయరీతిలో సాగింది. తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరణ చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకిపై కొలువు తీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళ వాయిద్యాల మధ్య భక్తుల జయ జయ ధ్వానాలతో మిథిల స్టేడియం ముఖద్వారం వద్దకు తీసుకొచ్చారు. వైకుంఠ ద్వారం వద్ద రామచంద్రున్ని మిథిలా స్టేడియం ద్వారం వైపు సీతమ్మ తల్లిని ఎదురెదురుగా ఆసీనులను చేశారు. రామచంద్రుని వైపు దేవస్థానం రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, సీతమ్మ వైపు స్థానాచార్యులు కేఈ స్థలశాయి వివరించారు.

ఈ సమయంలో అయోధ్య నుంచి రాముడు, మిథిల నుంచి సీతమ్మ తల్లి వచ్చినట్లుగా, సీతమ్మను మించిన వధువు ఈ లోకంలో మరొకరు లేరని వర్ణించారు. సీతారాముల గణగణాలను, సౌందర్యాన్ని, వంశ గౌరవాన్ని, ప్రతిభను ఒకరికి మరొకరు తీసిపోనట్లుగా వర్ణించి ఎంతో ఆసక్తికరంగా నిర్వహించారు. భక్తులు వారి వర్ణనలకు అనుగుణంగా కరతాళ ధ్వనులతో ఎంతోఆసక్తిగా ఆద్యంతం తిలకించారు. వర్ణన కార్యక్రమం పరిపూర్ణమైన తరువాత రామయ్య సీతమ్మల తరపున, సన్నాయి మంగళ వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ మాలా పరివర్తన కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ సమయంలో భక్తుల కరతాళ ధ్వనులు అంబరాన్ని అంటాయి. అనంతరం సీతారామచంద్రులను పక్క పక్కన ఆసీనులను చేసి ప్రత్యేక హారతిని సమర్పించారు.



ఎదుర్కోలు ఉత్సవంలో వేదికపై రామయ్య

ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ తరపున కమిషనర్ శ్రీధర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. చిన జీయర్‌స్వామి తరపున దేవనాద జీయర్‌స్వామి పట్టు వస్త్రాలను సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన గణేష్ టెంపుల్‌కి చెందిన చేనేత కళాకారులు రాపోలు గణేష్ తదితర చేనేత కళాకారులు తాము చేసిన చేనేత వస్త్రాలను శైలజా రామయ్యార్ చేతుల మీదుగా స్వామి వారికి అందజేశారు. చివరగా శ్రీ సీతారామచంద్రస్వామిని తిరువీధి సేవకుమేళతాళాలతో తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్, ముఖ్య ఉత్సవ అధికారి కృష్ణవేణి, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, కోటి రామస్వరూప్ రాఘవాచార్య పాల్గొన్నారు.

భద్రాద్రికి రేవంత్ నాలుగో సారి రాక

- ముఖ్యమంత్రి హోదాలో రెండో సారి..



భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భద్రాచలానికి రావడం ఇది నాల్గోసారి. ఇప్పటి వరకు మూడుసార్లు భద్రాచలం వచ్చిన ఆయన ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. తొలుత 2017 జూన్26న ఆనాడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేతగా ఐటీసీ పీఎస్‌సీడీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఎన్‌టీయూసీ మిత్ర పక్షాల తరపున వచ్చారు. అనంతరం 2023 ఫిబ్రవరి 14న పీసీసీ అధ్యక్షుడి హోదాలో హాత్‌సే జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చారు. 2024 మార్చి 11న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వచ్చారు. మళ్లీ తాజాగా ఆదివారం భద్రాచలంలో సీతారాముల కల్యాణంలో పాల్గొని ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు కుటుంబ సమేతంగా వస్తున్నారు.

పుష్ప విలాసం..

- రామయ్య లగ్గానికి 30 రకాల పూలు

భద్రాచలం, ఏ ప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణం ఆదివారం నిర్వహించనుండగా మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపం వేదిక కానుంది. ఈ కల్యాణ మండపాన్ని అందంగా అలంకరించేందుకు 30 రకాల పూలను వినియోగిస్తున్నారు. ఇందులో అత్యధిక పూలు విదేశాల నుంచి తెప్పించినవే కావడం విశేషం. కార్నిష్, బ్లూపర్పుల్ ఆర్కే2, బ్లూ ఆస్ట్రా, వైట్‌పర్పుల్ ఆర్కే2, ఎల్లో, లిలియమ్స్, బ్లూ డెమోజో, జింజర్, టైగర్ జింజర్,హెలికోనియం, హై డ్రోజన్, క్యాలిఫ్లవర్, త్రిషాంతం, సన్ ఫ్లవర్, గులాబీలు, క్లాడ్ తదితర రకాల పుష్పాలను మండపం అలంకరణ కోసం వినియోగిస్తున్నారు. వీటిని రూ.11 లక్షలతో కొనుగోలు చేశారు. శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణస్వామికి గజమాలలు, పూజకు ప్రత్యేకంగా విడి పూలు, గులాబీరేకులు సిద్ధం చేశారు.


నిలువ నీడ కరువాయే రామచంద్రా..

భద్రాచలం(బూర్గంపాడు), ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షిద్దామని తరలివచ్చిన భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి తాపానికి సేద తీరేందుకు లాడ్జీల్లో గదులు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇసుక తిన్నెలు, చెట్టు నీడనే సేద తీరుతున్నారు. భక్తులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, నిలువ నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. వంటలు చేసుకునేందుకు నీటి సౌకర్యం కూడా లేదని భక్తులు వాపోతున్నారు.

అద్వితీయం.. అభిజిత్ లగ్నం

- జన్మదినం నాడు జగదభిరాముని కల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సకల సుగుణాలకు నిలయమైన శ్రీరామచంద్రుడు జన్మించింది విలంబి నామ సంవత్సర చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో. అసలు సీతారాముల కల్యాణం జరిగింది రామాయణం ప్రకారం ఫాల్గుణ మాసంలో ఉత్తరా నక్షత్రం పూర్ణిమ తిథిలో. కాగా శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి శ్రీ పాంచరాత్రగమంలో యస్యవతార సమయే తస్యకల్యాణమాచరేత్ అన్న సూక్తిని అనుసరించి 'ఏ దేవుడు ఎప్పుడు జన్మించాడో ఆ దేవుని కల్యాణం ఆ రోజు ఆచరించాలి ' అనే నియమానుసారం భక్తరామదాసు జగధబిరాముడు జన్మించిన రోజునే జానకి రాముల కల్యాణ ఆచరణకు శ్రీకారం చుట్టారు. ఆనాటి నుంచి శ్రీరామనవమి నాడే దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యా ణం చైత్రశుద్ధ నవమి నాడు ఆయన జన్మించిన రోజే నిర్వహిస్తుండటం విశేషం. కాగా భద్రాద్రినే ఆదర్శంగా తీసుకొని రెండు తెలు గు రాష్ట్రల్లోనే కాకుండా యావత్ ప్రపంచంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం అభిజిత్ లగ్నంలో నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.



రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము | మాజీ ప్రధాని దేవగౌడ దంపతులు | కంచి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి | మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ | జయేంద్ర సరస్వతి

ఆధ్యాత్మిక నగరి మధుర జ్ఞాపకాలివి..

భద్రాచలం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఇప్పటి వరకు ఎందరో ప్రముఖులు దర్శించి పూజలు నిర్వహించారు. తొలుత అప్పటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గోదావరి వారధిని 1965 జూలై 13న ప్రారంభించి అనంతరం భద్రాద్రి రామయ్య దర్శనం చేసుకున్నారు. అలాగే 1964లో ఆలయ పునరుద్ధరణ, శిల్పకళా శోభితమైన కల్యాణ మండపం సంప్రోక్షణ కార్యక్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతి, శ్రీమన్నారాయణ పెద్ద జీయర్‌స్వామి, వానమామలైకి చెందిన శఠగోప రామానుజ జీయర్‌స్వామి పాల్గొన్నారు. 2017 ఆగస్టు 16న మాజీ ప్రధానమంత్రి దేవగౌడ దంపతులు భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. 2022 డిసెంబరు 28న ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము భద్రాద్రి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆస్థాన ఏనుగు



1,740 డబుల్ ఓటరు గుర్తింపు కార్డులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): రెండు ఓటర్ల గుర్తింపు కార్డులు ఉంటే తొలగించాలని, ఓటర్లు కోరిన చోట గుర్తింపు కార్డు ఉంచాలని అర్బన్ తహసీల్దార్ వీ రవికు మార్ సూచించారు. ఖమ్మం డీఆర్సీ భవనంలో శనివారం బూత్‌లెవల్ ఆఫీసర్లు, పర్యవేక్షకుల సమావేశం నిర్వహించారు. ఖమ్మం నియోజకవర్గంలో 1,740 ఓటర్లు రెండు ప్రాంతాల్లో ఓటు హక్కును కలిగి ఉన్నారని గుర్తించారు. వారి వివరాలను ఆన్‌లైన్ రికార్డులను బూత్ లెవల్ అధికారులు, పర్యవేక్షకులకు పంపిణీ చేశారు. ఆయా ఓటర్లకు బీఎల్‌వోలు ఫోన్లు చేసి ఒక వ్యక్తికి ఒకే ఓటు గుర్తింపు ఉండేలా నమోదు చేయాలని ఆదేశించారు. డీటీ కల్పన, సీనియర్ అసిస్టెంట్ బాలసాని కొండల్‌రావు, కేఎంసీ ఏవో శివలింగం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేఎంసీలో వార్డు ఆఫీసర్ల విభజన

ఖమ్మంసంక్షేమ విభాగం,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతీ రెండు డివిజన్‌లకు ఒక వార్డు ఆఫీసర్‌ను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నియమించారు. ఖమ్మం నగరంలో ఇప్పటికే నార్త్‌జోన్ కార్యాలయం పాతమునిసిపల్ కార్యాలయంలో ప్రారంభమైంది. రెండురోజుల్లో బల్లేపల్లిలో సౌత్‌జోన్ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈక్రమంలోనే వార్డుఆఫీసర్లను నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్,సెంట్రల్ జోనల్ కార్యాలయాల వారీగా విభజన ప్రక్రియను పూర్తి చేశారు. కేఎంసీ కార్యాలయంలో వారికి వృత్తిపర శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు. పట్టణ ప్రణాళిక, ఎకౌంట్స్, ఇంజనీరింగ్ విభాగాలపై ఆయా విభాగాల పర్యవేక్షక అధికారులు శిక్షణ ఇచ్చారు.

నార్త్‌జోన్ కార్యాలయం పరిధిలో..

వార్డు ఆఫీసర్	వార్డులు	సెల్ నెంబర్
చట్టు సుదర్శన్	1,2	81868 45004
పూలబాల సతీష్	3,6	76739 93821
యడ్లపల్లి వినోద్‌కుమార్	4,5	76740 18115
గోద వంశీకృష్ణ	7,8	76406 26603
దురిశెట్టి వెంకటేశ్వర్లు	9,10	76710 75019

ఈస్ట్ జోన్ కార్యాలయం పరిధిలో..

కొల్లి శైలజ	12,13	89198 47337
వేముల మురళి	14,15	91820 12920
తోకల ప్రత్యూష	11,21	88973 96460
కొమ్మినేని అనురాధ	19,20	76800 05191
దోడ్డపనేని అర్చన	22,23	93900 88714

సౌత్ జోన్ కార్యాలయం పరిధిలో

బలవంతపు రాజు	16,18	86867 42012
నేసిన రాజు	24,26	76609 91318
భూక్యా నిరోష	25,39	94935 82873
వలపదాసు హనీష	40,42	90108 24345
బండి సంధ్య	37,38	70322 61730

వెస్ట్‌జోన్ కార్యాలయం పరిధిలో..

ఎం చరణ్	17,27	81068 07760
పీ గణేష్	28,29	84456 67493
టీ శివ	31,32	80960 59718
ఎం సుధాకర్	30,34	96529 41855
భూక్యా ఉపేందర్	33,36	70951 19486
డీ ఉపేందర్	35,46	7095073615
ఉమేష్‌చంద్ర	47,48	91823 73622
ఎం వేణు	59,60	70111 85469

సెంట్రల్ జోన్ కార్యాలయం పరిధిలో

కారుమంచి యాదగిరి	41,54	99597 96118
ఏ. ప్రేమ్‌కుమార్‌రెడ్డి	45,49	98490 21582
నెల్లూరి సింధు	43,44	96518 03518
టీ సాయికౌశిక్	51,52	93462 67368
ఎస్ సందీప్	53,57	99896 72781
ఎం నాగరాజు	55,56	96038 12260
ఏ వసంత	50,58	96038 86052

జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

జయంతి సభలో కొనియాడిన వక్తలు

డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు నివాళులు అర్పించారు. జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల, తెలంగాణ నాన్‌గెజిటెడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్,టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేల్పాద్రి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీ కార్యాలయంలో పోలీసుకమిషనర్ సునీల్‌దత్ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలంగాణ మాదిగహక్కుల దండోరా ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. : నెట్‌వర్క్




కేఎంసీలో నివాళులు అర్పిస్తున్న మేయర్ నీరజ, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పువ్వాళ్ల, రాయల..



నివాళులర్పిస్తున్న సీపీ సునీల్‌దత్



తెలంగాణ మాదిగ హక్కుల దండోర ఆధ్వర్యంలో..



జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో..



టీజీవో, టీఎన్జీవో ఆధ్వర్యంలో..



తిరుమలాయపాలెం ఎంపీడీవో కార్యాలయంలో..

ప్రణాళికతో చదవాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పోటీపరీక్షల్లో అభ్యర్థులు ప్రణాళికతో చదవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం నగరంలోని జలగం వెంగళరావు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు.గ్రూప్‌డి, న్యాయ విభాగం, జూనియర్ లెక్చరర్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఏపరీక్షకు సిద్ధమవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలి, ఇంకా ఎమైనా అవసరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు వాటర్‌కూలర్స్, స్టడీ చైర్స్ కావాలని అడుగగా వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన పుస్తకాల జాబితాను తయారు అందించాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీలత ఉన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

పెనుబల్లి,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుఢీకొని మహిళ మృతిచెందింది. మండ లంలోని కారాయిగూడేనికి చెందిన బాణోతు మారోని(50) వీఎంబంజర్ రింగ్ సెంటర్లో రోడ్డు దాటుతుండగాసత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. గాయపడిన ఆమెను పెనుబల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

చింతగుర్తిలో శ్రీరామ నామస్మరణ

రామాలయం దశమ వార్షికోత్సవం ప్రారంభం

రఘునాథపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి గ్రామం శ్రీరామ నామ స్మరణతో మారుమోగింది. గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీరామాలయం దశమ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 3న పూజలు ప్రారంభం కాగా, శనివారం జలబిందెలతో గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించి శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నేడు శ్రీరామనవమికి కమిటీ పెద్దలు తమ్మినేని నాగేశ్వరరావు, కేతినేని సీతారామయ్య, మెంటం రామారావు, డాక్టర్ సోమశేఖర్, భూక్య వెంకన్న, మాలోత్ రాంబాబు, మాలోత్ వెంకన్న, కొత్త కొమరయ్య ఏర్పాట్లు చేశారు.

శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు

ఖమ్మంరూరల్: పొన్నేకల్లులోని రామాలయం, శ్రీసిటీలోని రామాలయం, తల్లంపాడులోని రామాలయం, తెల్దారుపల్లి, మంగళగూడెం, కాచిరాజుగూడెం, ఆరెంపుల, ఏదులాపురం, పెద్దతండా తదితర గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబైయ్యాయి.

తిరుమలాయపాలెం: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని రామాలయాలను ముస్తాబు చేశారు. సుబ్లేడు, బీరోలు, బచ్చోడు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, కొక్కిరేణి, గోపాలపురం,జల్లేపల్లి తదితర గ్రామాలలో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు గాంధీచౌక్‌లో రాములోరి కల్యాణం

ఖమ్మం ఖానాపురంహవేలి: నగరంలోని గాంధీచౌక్‌లో శ్రీ సీతారామచంద్రస్వామి 78వ వార్షిక కల్యాణోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. 7న, పట్టాభిషేకం అనంతరం కనకాభిషేకం నిర్వహించనున్నారు. 8న, హనుమాన్‌చాలీసా, మహా పుష్పాభిషేకం, రాత్రి మహిళలచే సామూహిక కుంకమ పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



చింతగుర్తి వేడుకల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు



పొన్నేకల్లులోని రామాలయం

ఏదులాపురం మునిసిపాలిటీలో 32 వార్డులు

- ప్రాంతాలు, వార్డుల వారీగా ఓట్లు ప్రకటన
- గెజిట్ అనంతరం స్వల్ప మార్పులు చేర్పులు ఉంటాయంటున్న అధికారులు



ఖమ్మంరూరల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలో 32వార్డులు ఖరారు చేశారు. అధికారులు శనివారం ప్రాంతాలను విడుదల చేశారు. మునిసిపాలిటీలో మొత్తం 12పంచాయతీలను కలిపి ఏదులాపురం మునిసిపాలిటీని ఫిబ్రవరి6నఏర్పాటు చేయటం తెలిసిందే. అయితే ఈ 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 32వార్డులుగా నియమించారు. వీటిలో చేర్పులు, మార్పులు ఉండే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

1వ వార్డు
పల్లెగూడెం, రెడ్డిపల్లి, సాయినగర్, వికలాంగుల కాలనీ, భద్రాద్రి కాలనీలను కలుపుతు ఒక వార్డుగా ఏర్పాటు చేశారు. ఈ వార్డులో మొత్తం 1547 ఓట్లు ఉన్నాయి.

2వ వార్డు
రాజీవ్‌గృహకల్ప, నాలుగోతరగతి ఉద్యోగుల కాలనీ, సాయికృష్ణ నగర్ ఉన్నాయి. ఇందులో 1577 ఓట్లు ఉన్నాయి.

3వ వార్డు
నాయుడుపేట, కరుణగిరి ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో 1476 ఓట్లు ఉన్నాయి.

4వ వార్డు
జలగంనగర్, ఆర్టీసీ కాలనీ, 1485 ఓట్లు..

5వ వార్డు
పెద్దతండా కాలనీ, కేబీఆర్‌నగర్, ఆర్టీసీ కాలనీ ఇందులో 1445 ఓట్లు..

6వ వార్డు
సాయిప్రభాత్ నగర్, టెంపుల్ సిటీ, అభయ టౌన్ షిప్, సింగరేణి కాలనీ, గుర్రాలపాడుతండాలో 1542 ఓట్లు..

7వ వార్డు
గుర్రాలపాడు గ్రామం, ఆర్టీసీ కాలనీ, శ్రీవారీ నగర్ కాలనీ, సత్యసంకల్ప, షాబాస్ మైసిరెడ్డి నగర్‌లో 1443 ఓట్లు..

8వ వార్డు
ఇందిరమ్మ ఫేస్1, కోటనారాయణపురం, ఎస్ఆర్ నగర్, మహాలక్ష్మీ వెంచర్, ఏవిఆర్‌నగర్ లో 1329 ఓట్లు..

9వ వార్డు
చిన్న వెంకటగిరి, జంగాల కలనీ, ఎస్సీ, బీసీ కాలనీ పార్ట్ లో 1093 ఓట్లు..

10వ వార్డు
ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ లో 1590 ఓట్లు..

11వ వార్డు
ఓసీకాలనీ, సంధ్యాతండా, బీసీ కాలనీ వంజర కాలనీ పార్ట్‌లో 1597 ఓట్లు..

12వ వార్డు
పెద్దవెంకటగిరి, ఎస్సీబీసీకాలనీ పార్ట్‌లో 1027 ఓట్లు..

13వ వార్డు
ఇందిరమ్మ ఫేస్2, జీప్లస్1 కాలనీ, వెంకటగిరి క్రాస్‌రోడ్డు- 1273 ఓట్లు..

14వ వార్డు
తెల్దారుపల్లిలోని మహరాజుల కాలనీ, బోళ్ల గడ్డ, పాటిమీదితండా, చాకలిబజార్ 1339 ఓట్లు...

15వ వార్డు
ఎస్సీ, బీసీ కాలనీ, జీపీ సెంటర్, ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా లో 1346 ఓట్లు..

16వ వార్డు
మద్దులపల్లి పార్ట్, మోడల్ కాలనీ, డబుల్‌బెడ్‌రూం, లక్ష్మీనగర్‌లో 1367 ఓట్లు..

17వ వార్డు
మద్దులపల్లి ఓల్డ్ విలేజ్, ఇందిరమ్మ కాలనీ, టీకేఆర్ నగర్, వీరాంజనేయ వెంచర్ ప్రాంతాలు ఉన్నాయి. 1326 ఓట్లు..

18వ వార్డు
బారుగూడెం, శ్రీసీటీ, వాయిపుత్రనగర్ 1396 ఓట్లు ఉన్నాయి..

19వ వార్డు
గొల్లగూడెం, డబుల్‌బెడ్‌రూరం, శ్రీసీటీ 7,8,9 రోడ్లు, వెంకటాద్రి టౌన్‌షిప్‌లో 1290 ఓట్లు

20వ వార్డు
బోడ్రాయి సెంటర్, సావిటి సెంటర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ 1260 ఓట్లు

21వ వార్డు
నిమ్మతోటబజార్, ఎస్‌వీఆర్‌నగర్,ఎస్సీ కాలనీ మైసమ్మ టెంపుల్, కాచిరాల బండ 1317 ఓట్లు..

22వ వార్డు
టీఎన్జీవో కాలనీ, సాయిగణేష్ నగర్, సప్తగిరి నగర్‌లో 1504 ఓట్లు..

23వ వార్డు
గాయత్రీనగర్, సత్యనారాయణపురం, సాయి నగర్, ఇందిరమ్మ కాలనీ, రాఘవేంద్రనగర్‌లో 1510 ఓట్లు..

24వ వార్డు
సూర్యానగర్,చంద్రానగర్,తాళ్ళేసితండా, చిన్న తండా,కేఎల్ఆర్‌బృందావనమ్,గోకుల కృష్ణనగర్, ఆదిత్యటౌన్‌షిప్, నందనవనం. 1358 ఓట్లు..

25వ వార్డు
బీబీఎమ్ స్కూల్ ఏరియా, టీచ్చర్స్ కాలనీ, నడిమితండా, లెక్చరర్స్ కాలనీ 1508 ఓట్లు..

26వ వార్డు
పెద్దతండా జీపీ రోడ్డు, టీచ్చర్స్ కాలనీ లో 1462 ఓట్లు..

27వ వార్డు
ఆర్ఎస్ నగర్, లక్ష్మీబృందావనం, పెద్దతండా లో 1456 ఓట్లు

28వ వార్డు
షాబాదునగర్, నారపొంగు బజార్, హచ్ ఎన్ బజార్, శ్రీరాంనగర్, మారుతి నగర్ రోడ్డు7,8,9, చైతన్య నగర్‌లో 1503 ఓట్లు..

29వ వార్డు
రైస్‌మిల్లు ఏరియా, వెంకటసుదానగర్, ఆయోధ్యనగర్, మారుతినగర్, శ్రీరాంనగర్ పార్ట్2 లో 1327 ఓట్లు ఉన్నాయి.

30వ వార్డు
ఆటోనగర్‌కాలనీ, డీబీఆర్‌నగర్, సాయి బృందావనం కాలనీ, పోన్నేకల్లు డొంక, కొప్పుల బద్రయ్య నగర్ ఉన్నాయి.1320 ఓట్లు ఉన్నాయి.

31వ వార్డు
ఏదులాపురం ఎస్సీ కాలనీ, గనపూర్‌స్టేజి 1353 ఓట్లు ఉన్నాయి.

32వ వార్డు
ఏదులాపురం బీసీకాలనీ, వెంపటినగర్, ఓరుగంటి నగర్, సింహాద్రినగర్‌లో 1333ఓట్లు ఉన్నాయి.

ఘనంగా సెంచరీ పాఠశాల వార్షికోత్సవం



ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెంచరీ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మువ్వా శ్రీనివాసరావు, గుర్రం కాంతరావు, సోషల్ వెల్ఫేర్ సంచాలకుడు కస్తాల సత్యనారాయణ, డాక్టర్ గౌతమ్ యలమూడి, మనోజ్ యలమూడి, పాఠశాల కరస్పాండెంట్ డీవీఎస్ ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని అధిగమిస్తాం

ఖమ్మంరూరల్ ఎంపీడీవో కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఖమ్మంరూరల్,ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమిస్తామని ఖమ్మం రూరల్ ఎంపీడీవో కుమార్ తెలిపారు. తాగునీటి సరఫరాపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: తాగునీటికి ఏం చర్యలు తీసుకున్నారు

ఎంపీడీవో: మండలంలో 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి.అందులో మేజర్‌గా కాచిరాజుగూడెం, మంగళగూడెం, గోళ్ళపాడు గ్రామాలో తాగునీటి ఎద్దడి ఎర్పడే అవకాశాలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్లును గుర్తించాం వాటిద్వారా వేసవిలో ప్రజలకు తాగునీరు అందిస్తాం. ప్రస్తుతం ఎలాంటి తాగునీటి ఇబ్బందిలేదు.

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్నులు ఎంత ఉన్నాయి, ఎంత వసూల్ అయ్యాయి?

ఎంపీడీవో: మండల వ్యాప్తంగా మొత్తం రూ.1 కోటి, 11 లక్షల, 64వేల,577 ఇంటి పన్నులుఉన్నాయి. అందులో ఇప్పటి వరకు రూ.98లక్షల,43వేల,192వసూల్ అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు సరైన సేవలు అందడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి?

ఎంపీడీవో: గ్రామాల్లో ప్రత్యేకాధికారులు అందుబాటులోనే ఉంటున్నారు. సేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎలా జరుగుతున్నాయి?

ఎంపీడీవో: అన్నిగ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. ఉదయం ట్రాక్టర్ల ద్వారా తడి,పొడి చెత్త సేకరణ సేకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ట్రాక్టర్ల రవాణాను పరిశీలిస్తున్నాం. పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నాం. గ్రామాల్లో సైడ్ కాల్వల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం.

కాషాయజెండా రెపరెపలాడాలి

బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావం సందర్భంగా ఆదివారం జిల్లానలుమూలలా కాషాయజెండా రెపరెపలాడాలని కార్యకర్తలు, నాయకులకు జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 1980 ఏప్రిల్ 6న జనతాపార్టీ నుంచి విడిపోయిందన్నారు. నాటినుంచి నేటివరకు పలుమార్లు కేంద్రంలో అధికారంలో వచ్చిందన్నారు. వివిధ సంక్షేమపథకాలతో ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిందన్నారు. అన్నినియోజకవర్గాలు, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించాలని కోరారు.

రహదారుల అనుమతులు పర్యవేక్షించిన సీఈ

బోనకల్,ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్అండ్‌బీ రహదారుల టెక్నికల్ పనుల అనుమతులు ఇచ్చేందుకు శనివారం ఆర్అండ్‌బీ సీఈ జె.మోహన్ నాయక్ పర్యవేక్షించారు. బోనకల్ నుంచి రాయనపేట వరకు గల రహదారి విస్తరణ పనులకు రూ.15కోట్లు, రావినూతల నుంచి పొద్దుటూరు వరకు విస్తరణ పనులకు రూ.25 కోట్లు, మోటమర్రి నుంచి కలకోట వరకు రూ.20 కోట్లు మంజూరు అయ్యాయి. పనులు ప్రారంభించే క్రమంలో శాఖపర అనుమతుల కోసం ఆయన గార్లపాడు, ఆళ్లపాడు, కలకోట రోడ్డు మార్గాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ వి. యుగందర్, ఈఈ థానేశ్వర్, డీఈ జి. శంకర్రావు ఉన్నారు.

సన్నబియ్యంతో లబ్ధిదారుల్లో సంతోషం

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

కూసుమంచి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తం అవుతోందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని జుజ్జులరావుపేటలో సన్నబియ్యం పంపిణీ చేశారు. శనివారం రాయల నాగేశ్వరరావు గ్రామానికి చెందిన కసతల ఉమకు 18కేజీల సన్న బియ్యాన్ని అందించారు. అనంతరం ఉమ ఇంట్లో ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యంతో చేసిన వంటను రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌తో కలిసి భోజనం చేశారు. ప్రతీపేదవాడి కడుపు నింపాలన్న లక్ష్యంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే ప్రప్రథమంగా సన్న బియ్యం అందిస్తున్నారన్నారు. ఎన్నోసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని, వారి విమర్శలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.



లబ్ధిదారుని ఇంట్లో సన్న బియ్యంతో వండిన అన్నం తింటున్న రాయల

నాణ్యమైన విద్యుత్ సరఫరా: డీఈఈ

సత్తుపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి సబ్ స్టేషన్ పరిధిలో లోవోల్టేజీ సమస్య ఉండదని, వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో డీఈఈ ఎల్.రాములు అన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.90లక్షల వ్యయంతో పట్టణ శివారులోని ఐపీడీఎస్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 5మెగా వాట్ల యాంపియర్ సామర్థ్యం కలిగిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఖమ్మం డీఈఈ(ఎంఆర్‌టీ) జేబీ.పవార్‌తో కలిసి శనివారం రాత్రి ప్రారంభించారు. తగినంత విద్యుత్ సామర్థ్యం కలిగిన 5ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఈ వేసవిలో సబ్‌స్టేషన్ పరిధిలోని వార్డులలోని ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉండదని ఆయన స్పష్టంచేశారు.

అలంకారప్రాయంగా ధాన్యం కేంద్రాలు

- అరకొరగా అందిన గన్ని సంచులు
- అలాట్మెంట్ కాని రైస్ మిల్లులు
- వారం గడిచినా గింజ ధాన్యం కొనని వైనం
- పచ్చి ధాన్యం అమ్ముకుంటున్న రైతులు

కల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడి అయి పక్షం రోజులు గడుస్తోంది. రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ధాన్యం కేంద్రాలు ప్రారంభించగా, మరి కొన్ని గ్రామాల్లో ఇంత వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన పాపన పోలేదు. వరి సాగులో కల్లూరు మండలం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచింది. ఈ మండలంలో 33 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగిలో సాగు చేసిన వరి పైరును యంత్రాలతో కోయించి ఇప్పటికే యర్రబోయనపల్లి, రఘునాథబంజర, వాచ్యానాయక్‌తండ, జిడిబిపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువ శాతం పచ్చి ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్ముకోవటం జరిగింది. ఇక ప్రభుత్వం తరుపున రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గాను మండలానికి 31 కొనుగోలు కేంద్రాలు మంజూరు కాగా, అందులో 15 మాత్రమే ప్రారంభించారు. ఇక ప్రారంభించిన కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తరలించి, అమ్ముకొనేందుకు సిద్ధం కాగా, కేంద్రాలు ప్రారంభించి ఐదు రోజులు కావస్తున్న ఇంత వరకు ఒక గింజ ధాన్యం కూడ కొనుగోలు చేయలేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకు కాకుండ తక్కువగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని చెన్నూరు, పుల్లయ్యబంజరు, లక్ష్మీపురం, ఎర్రబోయనపల్లి, పోచారం, లింగాల, వైన్‌పురం, ముచ్చవరం, చిన్నకోరుకొండి, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఇంత వరకు గింజ ధాన్యం కొనలేదు. ఇంకా పలు గ్రామాల్లో నేటి వరకు ధాన్యం కేంద్రాలు ప్రారంభించనేలేదు.



పుల్లయ్య బంజరులో కొనుగోలుకు సిద్ధంగా ధాన్యం



వైబీ పల్లిలో జోరుగా పచ్చి ధాన్యం విక్రయాలు

అలాట్మెంట్ కాని రైస్ మిల్లులు

కల్లూరు మండలంలో ధాన్యం కేంద్రాలు ప్రారంభించారేకాని నేటి వరకు ఆయా కేంద్రాలకు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతికి గాను ఇంత వరకు సివిల్ సప్లై అధికారులు రైస్ మిల్లును అలాట్మెంట్ చేయలేదు. దీంతో పలు గ్రామాల్లో గత ఐదు రోజుల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్ముకునేందుకు తరలించగా ఇంత వరకు గన్ని సంచులు పూర్తి స్థాయిలో అందించలేదు. అరకొరగా మాత్రమే అందాయి. దీనికి తోడుగా కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతికి గాను అధికారులు రైస్ మిల్లులను కేటాయించలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్రాల నిర్వహకులు రైతుల నుంచి ధాన్యం ఎలా కొనుగోలు చేయాలని సందిగ్దంలో పడ్డారు. అసలే వేసవి సీజన్‌లో ఆకాల వర్షాలు, ఈదురు గాలుల ప్రభావం చూపుటంతో పలు విధాలుగా నష్టపోతున్నట్లు రైతులు చెప్తున్నారు. ఇప్పటికైన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు వేగంగా జరిపేలా త్వరతగతిన మిగిలిన కేంద్రాలను కూడ ప్రారంభించాల్సిన అవసరం ఉంది. కేంద్రాలకు పూర్తి స్థాయిలో అవసరమైన మేరకు గన్ని సంచులు, రైస్ మిల్లులు అలాట్మెంట్ చేస్తూ కొనుగోలు ప్రక్రియ వేగంగా జరపాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

కట్టా అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ, కల్లూరు



ధాన్యం కేంద్రాలను అరకొరగా ప్రారంభించారు. ఇంకా పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ఇతర మండలాల కంటే యాసంగి వరి పంట కల్లూరు మండలంలో ముందస్తుగా దిగుబడి అయింది. ప్రభుత్వం తరుపున ఏర్పాటు కావాల్సిన కొనుగోలు కేంద్రాల జాప్యం కారణంగా ఇప్పటికే పలు గ్రామాల్లో దళారులు ప్రవేశించి తక్కువ ధరకు పచ్చి ధాన్యం కొనుగోలు చేశారు. రైతులకు మద్దతు ధర పొందాలంటే త్వరతగతిన అన్ని కేంద్రాలను ప్రారంభించాలి. గన్ని సంచులు అందుబాటులో ఉంచాలి. ధాన్యం దిగుమతికి గాను స్థానికంగా అందుబాటులో ఉన్న రైస్‌మిల్లును కేటాయించాలి. అందుకు గాను సివిల్ సప్లై అధికారులు మిల్లర్లతో సమన్వయ పరచాలి. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

ఘనంగా షష్ట్యబ్దిపూర్తి వార్షిక బ్రహ్మోత్సవాలు

హాజరైన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి



మహా కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టారంలో 60 వసంతాలు పూర్తిచేసుకున్న కోదండ రామాలయంలో మహాకుంభాభిషేక సహిత షష్ట్యబ్ధి పూర్తి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన యాగ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరమహంస పరివ్రాజకు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామనుజ జీయరు ఆధ్వర్యంలో ఆలయ శిఖరానికి పంచవింశతి మహా కుంభాభిషేకం, అవభృదం, చక్రస్నానంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్యహోమం తదితర పూజలు సాగాయి. లక్ష్మీ సుదర్శన హోమం, హనుమత్ యజ్ఞం, రామ తారక మూలమంత్ర హవనంతో పాటు గ్రామ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. అష్టక్తత్తర హనుమాన్ చాలీసా పారాయణం, ధ్వజారోహణం తదితర పూజలు నిర్వహించారు.

స్వయంభుగా రాముడి పుణ్యక్షేత్రం

రెండో భద్రాద్రిగా ముత్తారం.. సాయం సంధ్యవేళలో కల్యాణం



సీతారామచంద్ర స్వామి మూల విరాట్టు

ముదిగొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాముని ప్రతిరూపంగా స్వయంభువై శ్రీరాముడు ఆవిర్భవించిన పుణ్యక్షేత్రమే ముత్తారం. రెండో భద్రాద్రిగా పిలవబడే ముత్తారం పూర్వకాలంలో ముక్తివరంగా పిలవబడేది. ముత్తారం క్షేత్రంలో ఉద్భవించిన శ్రీరామచంద్రుడే వైకుంఠ రాముడు. ఈ క్షేత్రం కాలక్రమేణా ముత్తారంగా రూపాంతరం చెందిన ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పుణ్యక్షేత్రం.

ఆలయ సుదీర్ఘ చరిత్ర..

సుమారు 400సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన స్వామి మహిమలు అమోఘమైనవి. ఆసఫ్ జాహీ నిజాం ప్రభువుల ఆస్థానంలో ముత్తారానికి చెందిన వనం కృష్ణరాయులు కొలువై ఉండేవాడు. క్రీస్తు శకం 1632లో జన్మించిన వనం కృష్ణరాయులు బాల్యం నుంచి రామతత్వము జీర్ణించుకొని రామభక్తుడై రామధ్యానంలో ఉండేవాడు. సమకాలీకుడైన నేలకొండపల్లి వాస్తవ్యుడు భక్తరామదాసుగా ప్రసిద్ధికెక్కిన కంచర్ల గోపన్నతో మిత్రుత్వం, బంధుత్వం కృష్ణరాములుకు ఉంది. భద్రాచలంలో సీతారాముల ఆలయ నిర్మాణం పూర్తయిన నాటి నుంచి ప్రతి ఏటా క్షేత్రశుద్ధ నవమి రోజున సీతారామ కల్యాణాన్ని రామదాసు నిర్వహించేవాడు. వనం కృష్ణరాయులు వృద్ధాప్యం పైబడిన సమయంలో కల్యాణానికి వెళ్తుండగా ప్రయాణం ఆలస్యమై గోదావరి ఒడ్డుకు చేరుకొని ఆగిపోయాడు. కృష్ణరాయులు కల్యాణ మహోత్సవం చూడలేకపోయానని, తాను తీసుకువచ్చిన తలంబ్రాలు స్వామివారికి సమర్పించలేకపోయానని దుఃఖమయమై మూర్ఛిల్లిన స్థితిలో రామచంద్రుడు ప్రత్యక్షమై నీవు ఇక ముందు భద్రాచలం రాలేవు కనుక నేనే నీకోసం వస్తానని, దేవాలయ నిర్మాణాన్ని చేపట్టమని తెలిపాడు. వెనుదిరిగిన వనం కృష్ణరాయులుకు విచిత్ర శబ్దాలు విన్పించాయి. అక్కడి నుంచి నడుచుకుంటూ వచ్చి కృష్ణరాములు గ్రామస్థులకు తెలిపాడు. తన మామిడితోటలో ఉన్న పుట్టలో స్వామి వెలవడంతో వనం కృష్ణరాయులు ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టడమే కాక తనకు ఉన్న 150ఎకరాల భూమిని ఆలయానికి దానమిచ్చాడు. ఆరోజు నుంచి ఈరోజు వరకు ఆభూముల నుంచి వచ్చే ఆదాయంతోనే స్వామివారికి దూపదీప నైవేద్యాలు కొనసాగుతున్నాయి. ఆనాటి నుంచి భద్రాద్రి రామచంద్రుని సన్నిధిలో జరిగే ఉత్సవాలు యధావిధిగా ముత్తారం సీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవచార్యులు తెలిపారు.

సాయం సంధ్యవేళలో రాములోరి కల్యాణం...

భద్రాచలంలో రాములవారి కల్యాణం ఉదయం వేళల్లో జరిగే ముత్తారం సీతారామచంద్రస్వామి సన్నిధిలో సాయం సంధ్యవేళలో నిర్వహించటం జరుగుతుంది. ఆనాడు వనం కృష్ణరాయులు వృద్ధాప్యంలో స్వామివారి దర్శనం అనంతరం వెనుదిరిగి తలంబ్రాలు తీసుకువచ్చే సరికి సాయంసంధ్యవేళ కావడంతో ఆనాటి నుంచి ఆనవాయితీగా భద్రాచలంలోని రాములోరి కల్యాణం ముగిసిన తర్వాత ఆ తలంబ్రాలను ముత్తారం తీసుకువచ్చి సీతారాముల కల్యాణాన్ని సాయం సంధ్యవేళల్లో నిర్వహించటం ఇక్కడ విశేషం.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

పెనుబల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ రింగ్ సెంటర్లో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని కారాయిగూడెం గ్రామానికి చెందిన బాణోతు మారోని(50) అనే మహిళ వీఎంబంజర్ రింగ్‌సెంటర్లో రోడ్డు దాటుతుండగా సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారోనిని పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మారోని మృతిచెందింది. ఈమేరకు వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీయూసీఐ మహాసభను విజయవంతం చేయాలి

కల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 13న వైరాలో జరగనున్న టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న కార్మికులకు పిలుపు నిచ్చారు. శనివారం కల్లూరులో టీయూసీఐ సమావేశం బి.సత్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ప్రధాన వక్తలుగా టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎల్ పద్మ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు అతిధులుగా విచ్చేయనున్నారని ఆయన తెలిపారు. కార్మికులందరు పాల్గొని వైరా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీయూసీఐ జిల్లా నాయకులు ఎన్ సీతారాములు, పుల్లారావు, నాయకులు మాల్యాద్రి, ఎం.నాగేశ్వరరావు టి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గీతా జ్ఞాన మందిరంలో తదియారాధన వేడుకలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలోని పార్ధసారధి స్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తదియారాధన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో, ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకులతో పాటు బాటసారులకు ఆహార పొట్లాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మామిడి రామచంద్రరావు, లీలాపరమేశ్వరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు ఆలయాలకు వెండి కిరీటాలు

కల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో గల పలు ఆలయాలకు శనివారం దాతలు రూ. 2.50 లక్షల విలువ గల వెండి కిరీటాలు అందజేశారు. చిన్నకోరుకొండిలో గల సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారికి గాను స్థానిక భక్తుడు తిరుమలశెట్టి గోపాలరావు తమ వంతుగా రూ.85 వేల విలువ గల వెండి కిరీటం అందజేశారు. అదే విధంగా మరో భక్తుడు చింతమాల శ్రీనివాస్ కూడ రూ.65 వేల విలువ గల వెండి కిరీటంను శ్రీ రామ లక్ష్మణ స్వామి వారికి అందజేశారు. ఇంకాను మరో భక్తుడు భరణీబాబు సీతమ్మతల్లికి గాను రూ.55 వేల విలువ గల వెండి కిరీటంను, అదే విధంగా శ్రీ అంజనేయస్వామి వారికి గాను భక్తుడైన మద్దినేని శ్రీనివాసరావు రూ. 50 వేల విలువ గల మరో వెండి కిరీటం అందజేశారు. పై విధంగా దాతలు పలు ఆలయాలకు వెండి కిరీటాలు అందజేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దాతలు, భక్త బృందం విశ్రాంత ఎస్ఐలు చిన్నపుల్లాదాసు, కమ్మరి రామారావు, చింతమాల ప్రసాద్, మద్దినేని సూర్యప్రకాశరావు, నాగేంద్రమ్మ, చింతమాల స్వరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి కల్యాణం

తల్లాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడలోని సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో శుక్రవారం రాత్రి అశ్వద్ద నా రాయణస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మందిర నిర్వాహకుడు యాసా నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నారాయణస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లాడ పరిసర గ్రామాల నుంచి భక్తు లు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: పీఆర్టీయూ

బోనకల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి కృషి చేస్తారని పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు తెలిపారు. బోనకల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. ఆయన విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఏకీకృత సర్వీసు రూల్స్ సీపీఎస్ విధానం రద్దు, గురుకులాల్లో పని చేస్తున్న టీచర్లకు పాత టైం టేబుల్ విధానం, కేజీబీవీ టీచర్లకు మినిమం టైం స్కేళ్లు వర్తింప చేసే విదంగా తమ ఎమ్మెల్సీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతారని తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్టీయు రాష్ట్ర నాయకులు రెబ్బా శ్రీనివాసరావు, దిలకత్తుల వెంకట రమణ, లింగం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీ

దుస్తుల పంపిణీ

కల్లూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో విశ్రాంత ఉద్యోగి యస్‌కె అబ్దుల్ లతీఫ్ తమ వంతుగా నిరుపేద మహిళలకు రూ. 35 వేల విలువ గల దుస్తులను వితరణ చేశారు. శనివారం స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ హరిత వారికి దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా దాతృత్వం చాటుకున్న విశ్రాంతి ఉద్యోగి లతీఫ్‌ను ఎస్ఐతో పాటుగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందర్ రావు, మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వేల్పుల కృష్ణయ్య, విశ్రాంత హెచ్ఎం కావేటి కృష్ణయ్య, విజ్ఞాన్ పాఠశాల హెచ్ఎం యస్‌కె ఇస్మాయిల్ మైనార్టీ నాయకులు యస్‌డి అమీరుద్దీన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

కల్లూరు, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తవ వంతుగా పాఠశాల అభివృద్ధికి రూ. 3 లక్షలు వితరణ చేశారు. దీంతో పాఠశాలకు అవసరమైన వంటగది నిర్మాణం, మైక్‌సెట్టు, ల్యాప్‌ట్యాప్‌లు ఇతర సామాగ్రి అందించనున్నారు. ఈ పాఠశాలలో చదివి పూర్వ విద్యార్థులు కాటంనేని రవీంద్రకుమార్, సంపత్‌కుమార్, రోటరీక్లబ్ జూబ్లీ హిల్స్ ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ పాఠశాలలో చదివి ఉన్నతంగా ఎదిగామన్నా కృతజ్ఞత భావంతో రుణం తీర్చుకునేందుకు తాము పేద పిల్లలకు చేయూత నిస్తున్నామని దాతలు స్పష్టం చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఖమ్మం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాటంనేని రమేష్ కూడా తమ వంతుగా ఈ పాఠశాల అభివృద్ధికి దాతలను ప్రోత్సహించి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో వంట గదిని ప్రారంభించి, ఫర్నిచర్‌ను అధ్యాపక బృందానికి అందజేయనున్నారు.

సాంకేతిక అనుమతులకై పర్యవేక్షించిన చీఫ్ ఇంజనీర్



పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్

బోనకల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్ అండ్‌బీ రహదారుల టెక్నికల్ పనులకు సంబంధించి అనుమతులు ఇచ్చేందుకు గానూ శనివారం ఆర్‌అండ్‌బీ సీఈ జె.మోహన్ నాయక్ పర్యవేక్షించారు. బోనకల్ నుంచి రాయనపేట వరకు గల రహదారి విస్తరణ పనులకు 15 కోట్లు, రావినూతల నుంచి పొద్దుటూరు వరకు విస్తరణ పనులకు 25 కోట్లు, మోటమర్రి నుంచి కలకోట వరకు 20 కోట్లు మంజూరు అయ్యాయి. శాఖపరమైన అనుమతుల కోసం గార్లపాడు, ఆళ్లపాడు, కలకోట రో డ్డు మార్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ వెంట జిల్లా ఎస్ఈ యుగంధర్, ఈఈ ధానేశ్వర్, డీఈ శంకర్రావు పాల్గొన్నారు.

దేవాలయానికి మైక్‌సెట్ల వితరణ

బోనకల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో గల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి శనివారం శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ సౌజన్యంతో అనుమోలు వెంకటేష్, రమణలు రూ. 15 వేల విలువ చేసే రెండు మైక్‌సెట్లను వితరణగా ఇచ్చారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులతో పాటు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు వేర్వేరుగా వేడుకలలో పాల్గొని నివాళులర్పించారు. అంతకముందు మండలం లోని సత్యంపేట గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు రేషన్‌కార్డు ద్వారా అందజేసిన సన్న బియ్యంతో వండిన భోజనాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఎమ్మెల్యే స్వీకరించారు. మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కమాండెంట్ ఎన్. పెద్దబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

వైరాలో..

వైరా : వైరాలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. మండల కాంగ్రెస్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు అలాగే కమిషనర్ చింతా వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బోనకల్‌లో..

బోనకల్: బోనకల్, కలకోట తదితర గ్రామాల్లో శనివారం బాబు జగ్జీవన్‌రావు జయంతి వేడుకలను అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన చేసి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, గిర్దావర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఈవో కృష్ణారావు, ఎంఆర్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన జయంతి వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాయకులు జక్కంపూడి కిషోర్, గోవిందు శ్రీనివాసరావు, కాపా రామారావు, కటికి కిరణ్, కేతేపల్లి భాస్కర్‌రావు నివాళులర్పించారు.



వైరా మునిసిపల్ కార్యాలయంలో..

మధిరలో..

మధిర రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం మధిర పట్టణంతోపాటు పలు గ్రామాల్లో నిర్వహించారు. మధిర బీఆర్ఎస్ కార్యాలయంలో, రాయపట్నం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిం చారు. మధిరలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మాటూరు గ్రామంలో యువత, ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు.

నవమికి ముస్తాబైన ఆలయాలు

వైరా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రామనవమి వేడుకలకు వైరా మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని గొల్లపూడి రెవెన్యూ పరిధిలో పొలాల మధ్య ఉన్న పులిగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జాతర జరుగనుంది. వైరా నడిబొడ్డున ఉన్న కోదండ రామాలయంతోపాటు మండలంలోని అన్ని ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలకు, అన్నదానానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

తల్లాడలో..

తల్లాడ: తల్లాడ మండలంలో శ్రీరామనవమి వేడుకలకు దేవాలయాలను ముస్తాబు చేశారు. పినపాక గ్రామంలోని కోదండ రామాలయంలో నవమి వేడుకల కోసం ప్రత్యేకంగా చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. మండలంలోని అన్ని రామాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆదివారం జరిగే నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ముదిగొండలో..

ముదిగొండ: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని రామాలయాలు ముస్తాబు చేశారు. మండలంలోని వెంకటాపురం, న్యూలక్ష్మీపురం, ముత్తారం, వల్లాపురం, వల్లభి తదితర గ్రామాల్లోని రామాలయాలో సీతారామచంద్రుల కల్యాణాన్ని నిర్వహించ నున్నారు. ముత్తారం సీతారామచంద్రస్వామి ఆలయంలో సాయం సంధ్యవేళలో కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో శ్రీరామ నవమి నిర్వహణకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశారు.

మట్టూరి వీరయ్యకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న పువ్వాళ్ల, రాయల

వైరా, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాను నమ్మిన కాంగ్రెస్ పార్టీ కోసం తుది శ్వాస వరకు పనిచేసిన సీనియర్ నాయకుడు మట్టూరి వీరయ్య లేని లోటు ఎవరూ తీర్చలేనిదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని సిరిపురంలో శనివారం రాత్రి జరిగిన మట్టూరి వీరయ్య వర్ధంతి సభలో వారు మాట్లాడారు. వీరయ్య, కమలమ్మ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరయ్య కుమారుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మట్టూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వర్ధంతి సభ జరిగింది. వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు మచ్చా నర్సింహారావు, మచ్చా బుజ్జీ, మట్టూరి కృష్ణారావు, మట్టూరి వెంకటేశ్వరరావు, గాలి శ్రీనివాసరావు, మట్టూరి నాగేశ్వరరావు, పర్సారి రామారావు, చప్పిడి వెంకటేశ్వర్లు, చింతనిప్పు మాధవరావు, కడియాల సతీష్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, రాంపూడి రోశయ్య, శెట్టిపల్లి శ్రీనివాసరావు, ముఖేష్ తదితరులు నివాళులర్పించారు.